క్లుప్తంగా

ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా



పట్నంబజారు: ఏపీఎస్ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్ఎంయూఏ) రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు గురువారం ఆర్టీసీ బస్టాండ్‌లో ఉద్యోగుల సమస్యలపై గుంటూరు–1,2 డిపోల రన్నింగ్, గ్యారేజీ ఉద్యోగులు ధర్నా చేపట్టారు. ధర్నాలో భాగంగా గేట్ మీటింగ్ నిర్వహించారు. కార్యక్రమానికి అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.ఎ.వి.ఎస్.ఎస్.రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు వెనుకాడబోమన్నారు. ఉద్యోగ భద్రత అమలు చేయాలని, ఈహెచ్ఎస్ స్థానంలో ఆర్టీసీలో ఉన్న పాత వైద్య విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. పదోన్నతులను రూల్స్ ప్రకారం కల్పించాలన్నారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంస్థ ద్వారా జీతాలు చెల్లించాలని, గ్యారేజీలో పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ధర్నా కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు సుబ్బారావు, శంకరరావు, అమర్‌నాథ్, సుజాత, లక్ష్మి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌పై అవగాహన కార్యక్రమం



పట్నంబజారు : ఈస్ట్ ట్రాఫిక్ పోలీసులు గురువారం విద్యార్థులకు ట్రాఫిక్ నియమ నిబంధనల గురించి వివరించారు. ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో వ్యవహరించాల్సిన తీరుపై అవగాహన కల్పించారు. మైనర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు నడపకూడదని సూచించారు. కార్యక్రమంలో ఈస్ట్ ట్రాఫిక్ సీఐ ఎ.అశోక్, ఎస్సైలు రవీంద్ర, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను కడితే వడ్డీపై రాయితీ

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థకు ఆస్తి, ఖాళీ స్థల పన్నుల బకాయిలు ఈ నెలాఖరులోపు ఏక మొత్తంగా చెల్లిస్తే వడ్డీపై 50 శాతం రాయితీని రాష్ట్ర ప్రభుత్వం ఈ నెలాఖరు వరకు పొడిగిస్తూ గురువారం ఆదేశాలు జారీ చేసిందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు నగరంలోని పన్ను బకాయిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పన్ను బకాయిలను ఏక మొత్తంగా చెల్లిస్తే వడ్డీపై 50 శాతం రాయితీని గత మార్చి నెలలో కల్పించిందని.. ఈ నెలాఖరు వరకు అవకాశం పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో 8, సర్కిల్ కార్యాలయంలో 6 ట్యాక్స్ కలెక్షన్ కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. సీనియర్ సిటిజన్స్, మహిళలకు మెయిన్ ఆఫీస్‌లో ప్రత్యేక కౌంటర్ అందుబాటులో ఉంచామన్నారు. ఈ కౌంటర్లు సెలవు రోజుల్లోనూ ప్రతి రోజు ఉదయం 7 నుంచి రాత్రి 8 గంటల వరకు పని చేస్తాయన్నారు.

జాగ్రత్తలతో ప్రసవ మరణాలు తగ్గింపు



గుంటూరు మెడికల్: గర్భం దాల్చింది మొదలు ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ప్రసవ మరణాలు తగ్గించవచ్చని ఐవీఎఫ్ స్పెషలిస్ట్, అహల్య హాస్పిటల్ వైద్యురాలు శనక్కాయల రాజకుమారి అన్నారు. గురువారం నేషనల్ సేఫ్ మదర్ హుడ్ డే సందర్భంగా స్థానిక కొత్తపేటలోని హాస్పిటల్‌లో అవగాహన సదస్సు జరిగింది. డాక్టర్ రాజకుమారి మాట్లాడుతూ... చాలామంది ప్రెగ్నెన్సీ సమయంలో జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల మాతృమరణాలు సంభవిస్తున్నాయన్నారు.

ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభం



పొన్నూరు: మండల పరిధిలోని కసుక్రు గ్రామంలో వేంచేసియున్న శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గురువారం ఆలయ వంశపారంపర్య అర్చకులు విజితేంద్ర .. స్వామి వారిని విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సాహితీవనంలో నిప్పుకణిక కొమ్మిరెడ్డి

- ఎన్‌కౌంటర్‌లో బలైన పాతికేళ్లు
- నేడు గుంటూరులో 'జ్వాలాశిఖ విశ్వమోహన్' పుస్తకావిష్కరణ సందర్భంగా...




పిడుగురాళ్లలోని లెనిన్‌నగర్



విశ్వమోహనరెడ్డి భవన్

తెనాలి: కొమ్మిరెడ్డి విశ్వమోహనరెడ్డి... ప్రజాఉద్యమనేత, శ్రామికవర్గ నవలా రచయిత. తన జీవితాన్ని, రచనా వ్యాసంగాన్నీ పీడితవర్గాల విముక్తి కోసం వినియోగించి, పాలకవర్గాలకు కంటగింపుగా తయారైన ఉద్యమకారుడు. ఆ వర్గం సృష్టించిన 'మానవహోమం'లో సమిధగా మారాడు. బూటకపు ఎన్‌కౌంటర్‌లో ఆయన కన్నుమూసి పాతికేళ్లు. ప్రజాసంఘాల నిరసనను, ప్రజాస్వామిక హక్కులను 'అధికారం' నిరంకుశంగా అడ్డుకుంటున్న సందర్భంలో విశ్వమోహన రెడ్డి స్ఫురణకు వస్తారు. జనసాహితి ఆధ్వర్యంలో 11న సాయంత్రం గుంటూరులోని సీనియర్ సిటిజన్స్ సేవాకేంద్రంలో 'జ్వాలాశిఖ విశ్వమోహన్' పుస్తకావిష్కరణ సభ జరగనుంది.

కడప జిల్లా ప్రొద్దుటూరు సమీపంలోని పొట్టిపాడు విశ్వమోహనరెడ్డి స్వస్థలం. సంపన్న రైతు కుటుంబంలో 1949లో జన్మించారు. జడలు విప్పి కరాళ నృత్యం చేసిన ఫ్యాక్షన్ మారణహోమంలో ఆస్తుల్ని, ఆస్తుల్నీ కోల్పోయాడు. పొట్టకూటి కోసం ఏదొక పనిచేయాల్సిన అగత్యం ఎదురైంది. జీవనం కోసం ఆయన చేయని పనిలేదంటే అతిశయోక్తి కాదు. రైతు ఇంట పాలేరుగా, రైతుకూలీగా, రిక్షా కార్మికుడిగా, ప్రింటింగ్ ప్రెస్ కార్మికుడిగా రకరకాల పనులు. ఆ క్రమంలోనే ఆ జీవితాల్లోని పీడననూ, దోపిడీని అవగతం చేసుకున్నాడు. తన బతుకు తాను బతుకుదాం అని సరిపెట్టుకోలేదు. తోటివారి జీవితాల్లో వెలుగులు నింపుదామని ఆలోచన చేశాడు. సంఘటిత శక్తిగానే అది సాధ్యమని నమ్మాడు. అందు కోసం కంకణం కట్టుకున్నాడు. నిద్రలేచింది మొదలు బండచాకిరీ మినహా మరేం తెలీని పాలేర్లకు సంఘం వచ్చింది. రిక్షా యూనియన్ ఆవిర్భవించింది. కార్మిక సంఘాలు ఏర్పాటయ్యాయి. అందుకు కారకుడు విశ్వమోహనరెడ్డి, తాను క్రియాశీలంగా ఉంటూ శ్రామికవర్గాల్లో చైతన్యం నింపాడు. దోపిడీకి వ్యతిరేకంగా హక్కుల కోసం గళం విప్పేలా చేసి, పోరుబాటన నడిపించాడు.



కొమ్మిరెడ్డి విశ్వమోహనరెడ్డి

ప్రమాణ పత్రం రాసుకుని...

'పాఠకులను సోమరిపోతులను చేసే కవిత్వాలకంటే ఆచరణలో ఒక పాఠకున్నయినా నిలపడానికి వచ్చే యథార్థాలే రాయడం నా ఉద్దేశం. చివరివరకు ఇదే పద్ధతి అనుసరిస్తానని, ఎట్టి వాస్తవరహిత, అభూతకల్పనలు నేను రాయబోననీ, నా పాఠకులకు నేను తెల్పుకుంటున్నాను' అని ప్రమాణపత్రం రాసుకున్నారు. ఆ మాటకు అటూ ఇటూ బెసగకుండా వాస్తవిక సంఘటనలు ఆధారం చేసుకుని ఆయన చేసిన రచనలు సంచలనాన్నే సృష్టించాయి. 'జైలు' నవల టాల్‌స్టాయ్ నవల 'నవజీవనం' అంతటి ఉత్తమమైన నవలగా గుర్తింపును పొందింది. 'జైలు'తోపాటు మరో నవలలను శారద సాహిత్యవేదిక, తెనాలి వారు ప్రచురించారు. విశ్వమోహనరెడ్డిని జాక్‌లండన్, గోర్కీ , కుప్రిన్ వంటి రచయితలతో పోల్చినవారున్నారు. అచ్చులో వచ్చిన ఆయన తొలి నవల 'మానవహోమం'ను 'భోగిమంటలు' సినిమాగా తీశారు. సినీ అవకాశాలు వచ్చినా, జనం ముఖ్యమనుకుని ఆయన ఆ రంగంకేసి చూడలేదు. ప్రకాశం జిల్లా ఇంకొల్లు నుంచి 'గెరిల్లా' అనే పక్షపత్రికనూ నడిపారు.

ప్రజా ఉద్యమాల్లో మమేకమైన విశ్వమోహనరెడ్డి సమసమాజం కోసం కృషి చేశారు. ఉమ్మడి గుంటూరుజిల్లా పిడుగురాళ్లలో నివసించారు. అక్కడ భూమిలేని పేదలకోసం 70 ఎకరాల్లో 700 మంది పేదలకు ఇళ్లు నిర్మించటం విశ్వమోహనరెడ్డి ఉద్యమజీవితంలో గొప్ప మలుపు. లెనిన్‌నగర్‌గా నామకరణం చేశారు. అలాగే కొండమోడు అటవీ ప్రాంతంలో ఖనిజం తవ్విన 60 ఎకరాలను ఆక్రమించి 300 ఇళ్లను శ్రామికుల కోసం నిర్మించి, తరిమెల నాగిరెడ్డినగర్‌గా పేరుపెట్టారు. తన ఉద్యమాలతో పాలకులకు కంటగింపుగా తయారయ్యాడు. ఈ నేపథ్యంలో 2000 ఏప్రిల్ 11న భూమనపల్లి ఎన్‌కౌంటరులో విశ్వమోహనరెడ్డి, రైతుకూలీ ఉద్యమనాయకురాలు పగిడిపల్లి మరియమ్మ మృతి చెందారు. దీనిపై రాష్ట్రవ్యాప్తంగానే కాకుండా విదేశాల్లోని తెలుగువారి నుండి తీవ్ర నిరసన ఎదురైంది. సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని రాష్ట్ర గవర్నర్‌కు అందజేయటం నిజంగా సాహితీలోకంలో చరిత్ర.



అక్కడ నిర్మించిన స్మారక స్థూపం

డిటెక్టివ్ పుస్తకాలతో సృజన

మరోవైపు నాలుగు డబ్బులు వస్తాయనే భావనతో జనంలో క్రేజ్ ఉన్న డిటెక్టివ్ పుస్తకాలతో ఆయనలోని సృజనకారుడు వెలుగుచూశాడు. హీరోయిజమ్‌ను ఎలివేట్ ఏస్తూ సస్పెన్స్‌తో కూడిన ఆయన క్రైమ్ నవలల కోసం పాఠకులు ఆసక్తిగా ఎదురుచూశారు. కొమ్మిరెడ్డి పేరుతో రాసిన ఆ పుస్తకాల రచనను తర్వాతికాలంలో వదిలేశాడు. ప్రజలకు మేలుచేయలేని రచనలతో ప్రయోజనం లేదని భావించిన విశ్వమోహనరెడ్డి తాను చూసిన జీవితాలు, అధ్యయనం చేసిన సమాజాన్ని అక్షరబద్ధం చేయటం ఆరంభించాడు. ఎవరి స్వార్థం వారిదే, నరబలి, మాయాలోకం, దాడి, దొంగలు, జైలు, బొంగరం, క్షణికం, ప్రేమ, అశ్రుతర్పణం మానవహోమం, పల్లె, బలి, రిగ్గింగ వంటి 20 నవలల్ని రాశాడు. ఒక్కో రచనా ఒక్కో ప్రత్యేకం. ఆనాటి పల్లెలు, మనుషుల్లోని వివిధ రూపాలు, కఠోర జీవనసత్యాలను నిస్సంకోచంగా వెల్లడించాయి. చతుర మాసపత్రిక కొమ్మిరెడ్డి రాసిన 12 నవలల్ని ప్రచురించింది. కేవలం 48 గంటల్లో నవల రాయగలిగిన అలాంటి ప్రతిభావంతుడిని మరొకరని చూడలేదని ప్రముఖ సాహితీవేత్త చలసాని ప్రసాదరావు కీర్తించాడు.

'మధుమేహానికి కారణమిదే'



గుంటూరు మెడికల్: ప్రపంచవ్యాప్తంగా ముఖ్యంగా ఆసియా దేశ ప్రజలు తెల్లటి బియ్యం, ఎక్కువ కార్బోహైడ్రేట్స్ కలిగిన ఆహారం తీసుకోవడం, సరియైన వ్యాయామం లేకపోవడం షుగర్ వ్యాధికి గురవుతున్నట్లు గుర్తించారని గుంటూరు నగరానికి చెందిన సీనియర్ మధుమేహ వ్యాధి నిపుణులు డాక్టర్ వి.వి. రామ్ కుమార్ చెప్పారు. ఈ విషయాన్ని థాయ్‌లాండ్‌లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో పలువురు మధుమేహ వ్యాధి నిపుణులు వెల్లడించినట్లు తెలిపారు. థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో ఈ నెల 6, 7వ తేదీల్లో 'వరల్డ్ డయాబెటిక్ కాంగ్రెస్ –2025' సదస్సు జరిగింది. గురువారం స్థానిక కొత్తపేటలోని ఎస్వీఆర్ షుగర్ హాస్పిటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో సదస్సు వివరాలు ఆయన వెల్లడించారు. ఇంటర్నేషనల్ డయాబెటిక్ ఫెడరేషన్ అధ్యక్షులు పాల్ పీటర్ సారథ్యంలో దాదాపు 120 దేశాల నుంచి 10 వేల మందికి పైగా ప్రతినిధులు పాల్గొన్నారన్నారు.

మున్సిపల్ కమిషనర్లకు వర్క్‌షాప్

నెహ్రూనగర్: విజయవాడలో రాష్ట్ర స్థాయి మున్సిపల్ కమిషనర్ల వర్క్‌షాప్‌లో గురువారం నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పాల్గొన్నారు. స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్‌లో జరిగిన ఈ రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్‌నకు ముఖ్య అతిథిగా పురపాలక శాఖ మంత్రి నారాయణ హాజరయ్యారు. మున్సిపల్ శాఖపై ప్రజల్లో సంతృప్తి శాతం పెరిగేలా కమిషనర్లు పనిచేయాలని సూచించారు. పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి దీపాలు, రోడ్లకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పేదలను ఇబ్బంది పెట్టకుండా పన్నులు వసూలు చేయాలని తెలిపారు. గుంటూరులో కుక్క కరిచి బాలుడు మృతి చెందడం చాలా బాధాకరమని, వీధి కుక్కలకు స్టెరిలైజేషన్‌పై దృష్టి పెట్టాలని మంత్రి నారాయణ సూచించారు.

ప్రయాణ సమయంలో జాగ్రత్త



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ

గుంటూరు వెస్ట్ : క్షణికానందం కోసం నిర్లక్ష్యంగా, అతివేగంగా ప్రయాణించడం వల్ల ప్రతి ఏడాది వందల సంఖ్యలో ప్రాణాలు కోల్పోతున్నారని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎ. భార్గవ్ తేజ తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి రహదారి భద్రతా కమిటీ సమావేశంలో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్‌తో కలిసి నిర్వహించిన సమావేశంలో ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ.. జాతీయ రహదారులపై వాహన ప్రమాదాలను నివారించేందుకు గుర్తించిన బ్లాక్ స్పాట్స్ వద్ద అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. దాదాపు 19 బ్లాక్ స్పాట్స్ గుర్తించామని తెలిపారు. జాతీయ రహదారి విస్తరణ కోసం కాజ, పెదకాకాని వద్ద భూ సమీకరణ వెంటనే చేపట్టాలన్నారు. స్థానిక సంస్థల నుంచి చెత్త సేకరించి జాతీయ రహదారులపై వెళ్లే వాహనాల నుంచి వ్యర్థాలు రోడ్లపై పడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ పోలీసుల సూచనల మేరకు కావాల్సిన బోర్డులను జీఎంసీ ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ, డీఆర్వో ఖాజావలి, అడిషనల్ ఎస్పీ రమణమూర్తి, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ శ్రీనివాసమూర్తి, జిల్లా ఉప రవాణా కమిషనర్ సీతారామిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.


మున్సిపల్ పాఠశాలకు వితరణ



మాట్లాడుతున్న కస్టమ్స్, జీఎస్టీ కమిషనర్ నరసింహారెడ్డి

లక్ష్మీపురం: మున్సిపల్ పాఠశాలకు కస్టమ్స్, జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి వివిధ సామగ్రి వితరణ చేశారు. గుజ్జనగుండ్లలోని మున్సిపల్ కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాల భవనానికి పెయింటింగ్ ఖర్చును అందించారు. ఐరన్ బీరువా, స్టాఫ్ టేబుల్స్, ఇరవై కుర్చీలను అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు సౌకర్యాలను కల్పించటంలో ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని కోరారు. విద్యతో పాటు మౌలిక సౌకర్యాలలో కూడా ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ బడులు తీర్చిదిద్దటానికి సాయం చేయడం సామాజిక బాధ్యతగా భావించాలన్నారు. స్వచ్ఛ భారత్ అభియాన్ నిధుల ద్వారా కస్టమ్స్, జీఎస్టీ కమిషనరేట్లు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి అండగా నిలుస్తాయన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఆయన్ను పాఠశాల సిబ్బంది సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బి. నరసింహారావు, ఎం.భాస్కరరావు, కె.సుధారాణి, జీఎస్టీ అధికారులు చీదేళ్ళ ఈశ్వరరావు, వరకుమార్, సాదిక్ అలీ, పూర్ణ సాయి, కాకర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారవేత్తగా మారేందుకు తొలినాళ్లలోనే బీజం



విజేతలతో విజయ బాపిరెడ్డి, ఎస్వీ రమణ, తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు మేనేజ్‌మెంట్ విద్యార్థులు చదువుకునే సమయంలోనే బీజం వేసుకోవాలని ధరణి ఇన్ఫోటెక్ అధినేత విజయ బాపిరెడ్డి పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో 'సృజన – మీలో ఎవరు ఎంటర్‌ప్రెన్యూర్' పేరుతో రెండు రోజులపాటు నిర్వహించిన పోటీలు గురువారం ముగిశాయి. ముఖ్య అతిథిగా విజయ బాపిరెడ్డి మాట్లాడుతూ.. వినూత్న ఆలోచనలతో ముందుకు వెళ్లినప్పుడే, వాటిని ఆచరణలోకి తీసుకురాగలమని అన్నారు. ప్రస్తుతం దేశంలో అగ్రశ్రేణి కంపెనీలుగా పేరు పొందిన సంస్థలు ఒకనాడు చిన్న ఆలోచనలతో ప్రారంభమైనవేనని వివరించారు. సృజన పోటీల్లో భాగంగా ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా విద్యార్థులు తమ కలను నిజం చేసుకునేందుకు చక్కటి వేదిక అయిందన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్వీ రమణ మాట్లాడుతూ... విద్యార్థులు స్టార్టప్, వెంచర్‌లను ప్రారంభించడంలో అవసరమైన వ్యవస్థాపక లక్షణాలను అభివృద్ధి చేసుకోవడానికి ఈ పోటీలను నిర్వహించామని తెలిపారు. విజేతలుగా నిలిచిన పరిపూర్ణ, హరితం, యార్న్ డిలైట్ బృందాలకు జ్ఞాపిక, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంబీఏ, ఎంసీఏ విభాగాధిపతులు డాక్టర్ వి.చక్రవర్తి, బి.రాజ్యలక్ష్మి, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ కె.లలిత, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కళ్యాణి, సహాయాచార్యులు ఎ. బాజీబాబు, సీహెచ్ వేదవతి, బి. అనిత, రాజరాజేశ్వరిదేవి, శశికళ, ఎంబీఏ, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు పాల్గొన్నారు.

సవాళ్ల సై..రన్!



ఇటీవల కాలంలో జేకేసీ కళాశాల రోడ్డులో కుయ్..కుయ్.. అటూ ఒక కారు అత్యంత హడావుడిగా వెళుతోంది. ఆ రోడ్డులో సామాన్యులందరూ అంబులెన్స్.. ఇతరత్రా వీఐపీ వాహనమో అని పక్కకు జరిగారు. ఈ హడావుడిలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న భార్యభర్తలు కిందపడిన పరిస్థితి నెలకొంది. ఆఖరికి ఆ కారు ఎవరిది..? అని గమనించగా కొంత మంది యువకులు ఆకతాయితనంగా పోలీసు సైరన్ వేసుకుని వెళ్లటాన్ని గమనించారు. స్థానికులు వాహనాన్ని ఆపుదామని ప్రయత్నించినా.. వారు వెళ్తున్న వేగానికి నిలువరించలేని పరిస్థితి ఏర్పడింది. ఇదే కాదు.. వివిధ రకాల శబ్దాలు కలిగిన హారన్‌లు, సైలెన్సర్లు తీసేసి వాహనాలు పెద్ద శబ్దంతో నడిపేవారు ఎక్కువయ్యారు.

- ఇష్టానుసారంగా వివిధ శబ్దాలతో హారన్‌ల వినియోగం
- అనధికారికంగా సైరన్‌లు వాడుతున్న వాహనదారులు
- వెనుక వస్తున్న వాహనం ఏదో అర్థం కాక ప్రజలకు ఇబ్బందులు
- ఏ మాత్రం పట్టించుకోని సంబంధిత అధికారులు
- కనీసం ఒక్క స్పెషల్ డ్రైవ్ కూడా చేపట్టని యంత్రాంగం
- అనధికారికంగా వినియోగిస్తే పర్మిట్ రద్దుకు సైతం అవకాశం

పట్నంబజారు : నగరంలో పలు సందర్భాల్లో పలుచోట్ల సైరన్లు మోగించుకుంటూ రయ్..రయ్.. అంటూ కొన్ని వాహనాలు దూసుకుపోవడం చూస్తూనే ఉన్నాం. అనధికారింగా ఏర్పాటు చేసుకున్న వాహనాలే అధికంగా కనపడుతున్నాయి. మొత్తం గుంటూరు నగరంలో 2 లక్షలకుపైగా ద్విచక్ర వాహనాలు, 40 వేలకుపైగా కార్లు ఉన్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో కార్లతోపాటు బైక్‌లకు కూడా పోలీసు సైరన్‌లు పెట్టుకుని యథేచ్ఛగా నిబంధలనకు తిలోదకాలిచ్చి వాహనాలు నడిపేస్తున్నారు. గతంలో కాకానికి చెందిన ఒక యువకుడు సైరన్ మోగించుకుంటూ తిరిగిన నేపథ్యంలో అతనిపై కేసు నమోదు చేశారు. వాహనాన్ని సీజ్ చేసి, కోర్టుకు హాజరుపరచగా రూ. 10 వేల జరిమానా, జైలు శిక్ష కూడా పడిన పరిస్థితులు ఉన్నాయి. నగరంలో యథేచ్ఛగా సైరన్ మోత మోగుతున్నా కనీసం ఆర్టీఏ, ట్రాఫిక్ పోలీసులు ఏ ఒక్క తనిఖీ నిర్వహించకపోవటం గమనార్హం.

టోల్ ప్లాజాల వద్ద....

ప్రభుత్వ అధికారులకు సంబంధించి కచ్చితంగా టోల్‌ప్లాజా వద్ద ఎటువంటి రుసుము కట్టాల్సిన పని లేదు. అయితే ఇందులో కూడా ప్రభుత్వ వాహనం అని రాసిన ప్రతి వాహనం పచ్చబోర్డు కలిగి ఉండాలి. అయినప్పటికీ కొంతమంది అధికారులు వారి ఐడీ కార్డులను సొంత వాహనాలకు కూడా వినియోగించుకుంటున్నారు. ఈ ఏడాదిలో ఆర్టీఏ, ట్రాఫిక్ పోలీసులు ఒక్క కేసు కూడా నమోదు చేయలేదంటే.. అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది. గుంటూరు నగరంలో సైరన్‌లు ఉపయోగించే వారిలో 90 శాతం మందికి అనుమతులు లేవని అర్థమవుతున్నప్పటికీ అధికారులు చర్యలకు ఉపక్రమించకపోవటం శోచనీయం.

ఈ వాహనాలకు ఓకే..

కేంద్ర ప్రభుత్వ రూల్ నెంబర్ 1989 ప్రకారం 43 మంది మాత్రమే సైరన్‌లు, ఎర్రబుగ్గ, బులుగు బుగ్గ ఉన్న కార్లు వినియోగించేందుకు అర్హులు. అయితే కొంత మంది అధికారులు వారి వ్యక్తిగత వాహనాలకు కూడా ఈ లైట్లు బిగిచటంతోపాటు సైరన్‌ల మోత మోగిస్తున్నారు. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాని, మాజీ రాష్ట్రపతులు, చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా, లోకసభ స్పీకర్, కేంద్ర కేబినెట్ మంత్రులు, మాజీ ప్రధానులు, ఉభయసభల ప్రతిపక్ష నేతలు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు మాత్రమే ఈ లైట్లు, సైరన్‌ల వాహనాలతో ప్రయాణించవచ్చు. ఇక అత్యవసర సేవలైన అంబులెన్స్, పోలీసు, ఫైర్ సర్వీసెస్‌తోపాటు మరికొన్ని సర్వీస్‌లకు మాత్రమే సైరన్ వాడే అధికారం ఉంది. అయినప్పటికీ నిబంధలను విస్మరించి కొంత మంది వ్యక్తులు ఇష్టానుసారంగా సైరన్‌లను వినియోగిస్తున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



నిబంధనలకు విరుద్ధంగా సైరన్ ఎవరు పడితే వారు వినియోగిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. సెక్షన్ 177 ప్రకారం కేసులు నమోదు చేయటంతోపాటు వాహనాన్ని సీజ్ చేసి, జరిమానా విధిస్తాం. ప్రైవేట్ వ్యక్తులు సైరన్ వినియోగించటం చట్ట విరుద్ధమే. పూర్తి స్థాయిలో దృష్టి సారించి చర్యలు చేపడతాం.

– కె.సీతారామిరెడ్డి, డీటీసీ, గుంటూరు జిల్లా

వేసవికి ప్రత్యేక రైళ్లు



లక్ష్మీపురం: సౌత్ సెంట్రల్ రైల్వే సమ్మర్ ప్రత్యేక రైళ్లను గుంటూరు రైల్వే డివిజన్ ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసినట్లు డివిజన్ సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ గురువారం రాత్రి వెల్లడించారు. రైలు నంబర్ 07025 చర్లపల్లి–శ్రీకాకుళం రోడ్ రైలు ప్రతి శుక్రవారం ప్రత్యేక రైలును ఈ నెల 11 నుంచి జూన్ 27వ తేదీ వరకు నడపనున్నట్లు తెలిపారు. నంబర్ 07026 శ్రీకాకుళం రోడ్డు–చర్లపల్లి రైలు ప్రతి శనివారం ఈ నెల 12 నుంచి జూన్ 28వ తేదీ వరకు నడపనున్నారు. ఈ రైలు నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ళ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, తుని, యలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి స్టేషన్‌ల మీదుగా ప్రయాణిస్తుందని తెలిపారు. రైలు నంబర్ 07121 తిరుపతి–మచిలీపట్నం రైలు ప్రతి ఆదివారం, ఈ నెల 13 నుంచి మే 25వ తేదీ వరకు, రైలు నంబర్ 07122 మచిలీపట్నం–తిరుపతి రైలు ప్రతి సోమవారం ఈ నెల 14 నుంచి మే 26వ తేదీ వరకు కేటాయించినట్లు తెలిపారు. ఈ రైలు రేణిగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, గుడివాడ, పెడన స్టేషన్‌ల మీదుగా ప్రయాణిస్తుందని తెలిపారు.

పొన్న వాహనంపై శ్రీలక్ష్మీనరసింహస్వామి



పొన్న వాహనంపై శ్రీస్వామి వారి గ్రామోత్సవం

నగరంపాలెం: స్థానిక ఆర్.అగ్రహారం శ్రీరాజ్యలక్ష్మీ సమేత లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. గురువారం స్వామి వారికి పొన్న వాహనంపై పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. నగరం, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. అనంతరం జయభార్గవి మహిళా సంస్కృతిక భక్త సమాజం ఆధ్వర్యంలో కోలాటం నిర్వహించారు. కార్యక్రమాలను ఈఓ ఎస్.ఆంజనేయాచార్యులు పర్యవేక్షించారు.



హాజరైన భక్తులు